ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025



బీటెక్, పీజీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను వర్సిటీ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి బీటెక్, ఎంసీఏ రెండో సెమిస్టర్, 26 నుంచి నాలుగో సెమిస్టర్, 17 నుంచి ఆరో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ నెల 29 నుంచి పీజీ రెండో సెమిస్టర్, ఐటెప్ 2,4 సెమిస్టర్, స్పెషల్ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు.

నగరం.. ట్రాఫిక్ దిగ్బంధం

- శ్రీకాకుళంలో ప్రతిరోజూ ఇదే సమస్య
- వాహనాల రద్దీ.. ఇరుకురోడ్లతో ఇక్కట్లు
- రోడ్లపైనే ప్రైవేటు వాహనాలు, ఆటోల పార్కింగ్
- రహదారుల విస్తరణ ప్రతిపాదన బుట్టదాఖలు


శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్‌లో అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు



'శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం. సమస్యలు ఎక్కడున్నాయే గుర్తించి వాటిని పరిష్కరిస్తాం. ప్రజలకు ఇక్కట్లు లేకుండా చేస్తాం'.. జిల్లా ఎస్పీగా కేవీ మహేశ్వర రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పుడు చేసిన ప్రకటన ఇది. నెలలు గడిచిపోతున్నా కానీ, ట్రాఫిక్ ఇబ్బందులు మాత్రం తొలగడం లేదు. ట్రాఫిక్‌కు ఇరుకు రోడ్లు ఒక కారణం కాగా.. ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు, ఆటోలు ఇష్టారాజ్యంగా రోడ్లపైనే నిలబెట్టడం.. నిబంధనలు పాటించక పోవడం మరో కారణం. పోలీసులు ప్రధానంగా వీటిపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇక శాశ్వత పరిష్కారం మాత్రం రోడ్ల విస్తరణే. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధి చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది.

శ్రీకాకుళం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి):

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టు ఉంది శ్రీకాకుళం నగరం పరిస్థితి. నగర జనాభాకు తోడు వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నా, అందుకు తగ్గట్టు రోడ్ల విస్తరణ మాత్రం జరగడం లేదు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ముఖ్యంగా బలగ ఆసుపత్రి జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, డేఅండ్‌నైట్ జంక్షన్, సూర్యమహల్ జంక్షన్, పొట్టి శ్రీరాములు కూడలి, ఏడురోడ్ల జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాలకొండ రోడ్డులో (మిగతా 4వ పేజీలో..)


ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు నిలిపిన ప్రైవేటు బస్సు

ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుటే.. ప్రైవేటు బస్సుల దందా

శ్రీకాకుళం నగరంలో ప్రైవేటు బస్సుల దందా నడుస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ప్రైవేట్ వాహనాలను ఆపకూడదనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రైవేట్ బస్సులను ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుటే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. మరికొన్ని ప్రైవేట్ బస్సుల సిబ్బంది నేరుగా కాంప్లెక్స్‌లోకే వెళ్లి ప్రయాణికులను తరలిస్తున్నారు. గంటల తరబడి రోడ్డుపై బస్సులను నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, టాక్సీలు కొద్ది నిమిషాల పాటు రహదారిపై ఆపితే హడావుడి చేసే ట్రాఫిక్ పోలీసులు, అధికారులు ప్రైవేట్ బస్సులపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

● జిల్లాలో శ్రీకాకుళం-1, 2, పాలకొండ, టెక్కలి, పలాస ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. దాదాపు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఆర్టీసీ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్టీసీని ఆశ్రయిస్తుంటారు. అయితే, ఇటీవల ప్రైవేటు బస్సులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మారుమూల మండలాల నుంచి సైతం విశాఖ, రాజమండ్రి, విజయవాడ నగరాలకు సర్వీసులను నడుపుతున్నారు. వాటికి అసలు అనుమతులు ఉన్నాయా లేవా అన్నది తెలియడం లేదు. జనాల అవసరాలను ప్రైవేటు ట్రావెల్స్ సొమ్ము చేసు కుంటున్నాయి. ముఖ్యంగా పండగలు, పర్వదినాల్లో రెట్టింపు ధరలకు టిక్కెట్లు విక్రయిస్తున్నారు. వారికి రాజకీయ అండదండలు ఉండడంతో అధికారులు అటు వైపు చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ప్రైవేటు బస్సుల దందాను నియంత్రించాలని కోరుతున్నారు.

పీ-4 విధానంతో పేదరిక నిర్మూలన

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంలో భాగంగా ఈ నెలాఖరులోగా బంగారు కుటుంబాల జాబితాను సిద్ధం చేయాలి. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి. రైతుల అవసరాలకు తగినట్లు బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలి. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి. నీటి నమూనాలను పరీక్షించి నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలి. హాస్టళ్లు, ఆసుపత్రులు, బస్టాండ్లలో పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ తప్పనిసరి' అని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉపకలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఐటీఈపీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

ఎచ్చెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని నాలుగేళ్ల ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం(ఐటీఈపీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఈ నెల 16 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైన విద్యార్థులు రూ.500 దరఖాస్తు రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. వెబ్ ఆప్షన్లలో డాక్టర్ బీఆర్ ఏయూను అభ్యర్థులు ఎంపిక చేసుకోవాలి. ఇంటర్‌లో మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ చేసిన వారు బీఎస్సీ బీఈడీలో చేరేందుకు అర్హులు. హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ చదివిన వారు బీఏ బీఈడీ కోర్సులో చేరవచ్చు. ఒక్కో కోర్సులో 50 సీట్లు వంతున ఉంటాయి. వెబ్ ఆప్షన్లను పూర్తిచేసి, అప్లికేషన్, సర్టిఫికెట్లను ఈ 29లోగా వర్సిటీకి అందజేయాలి. మరిన్ని వివరాల కోసం వర్సిటీ ప్రిన్సిపాల్, ప్రవేశాల ఇన్‌చార్జి డాక్టర్ ఎం.అనూరాధను 86746 00280 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాల'ని ఆమె సూచించారు.

కిలో గంజాయి రవాణాకు రూ.5వేలు

- 40 కిలోలు తరలిస్తూ పట్టుబడిన మహిళా గ్యాంగ్
- రెండు కేసుల్లో ఐదుగురి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు, పక్కన సీఐ సూర్యనారాయణ, పోలీసులకు పట్టుబడిన గంజాయి రవాణాదారులు(వెనుకన)

పలాస, జూలై 15(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. పలాస రైల్వేస్టేషన్ వద్ద సోమవారం రెండు వేర్వేరు ఘటనల్లో గంజాయి రవాణా చేస్తూ ఐదుగురు పట్టుబడ్డారు. ఇందులో ముగ్గురు మహిళలు కూడా ఉండడం గమనార్హం. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకు వచ్చి.. తమకు అప్పగిస్తే కిలోకు రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో వారు అత్యాశకు పోయి.. చివరకు పోలీసులకు చిక్కారు. ఈ వివరాలను మంగళవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లోని విలేకరుల సమావేశంలో డీఎస్పీ వి.వెంకట అప్పారావు వెల్లడించారు.

'బీహార్ రాష్ట్రం హరిహరపూర్ గ్రామానికి చెందిన ముతోష్‌షా, ఆయన భార్య ఆశాదేవి, అనితాదేవి, భీమాదేవి పాట్నాలో ఓ హోటల్‌లో వంట కూలీలు. వీరితోపాటు పింకి అనే మహిళ కూడా ఆ హోటల్‌లో పని చేస్తోంది. పింకి బీహార్‌లో గంజాయి రవాణా, అమ్మకం కూడా చేస్తుండేది. ఈమెకు ఒడిశాకు చెందిన సుమిత్‌గుప్తా, మనోజ్‌గుప్తాతో గంజాయి రవాణాకు సంబంధించి పరిచయం ఉంది. ఈ క్రమంలో ముతోష్‌షా, ఆశాదేవి, అనితాదేవి, భీమాదేవికి గంజాయి రవాణాపై పింకి అవగాహన కల్పించింది. ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి తమకు అప్పగిస్తే కిలోకు రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పింది. అత్యాశకు పోయి వారు అంగీకరించారు. ఆ నలుగురు ఒడిశా రాష్ట్రం కొంద మాల్ వెళ్లగా.. అక్కడ సంబల్‌పూర్‌కు చెందిన గీత, ఆమె భర్త వీరికి 40కిలోల గంజాయిని అప్పగించారు. ఆ గంజాయిని ప్యాకింగ్ చేసి పలాస మీదుగా బీహార్ వెళ్లేందుకు వారు సిద్ధమయ్యారు. కాగా, సోమవారం రాత్రి పలాస రైల్వే స్టేషన్ బయట వీరు అనుమానస్పదస్థితిలో తిరుగుతుండగా కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తన బృందంతో వెళ్లి తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ఆ నలుగురిని అదుపులోకి తీసుకుని, మంగళవారం పలాస కోర్టులో హాజరుపరిచామ'ని డీఎస్పీ తెలిపారు.

రెండు కిలోలతో మరొకరు..

పలాస రైల్వేస్టేషన్ వద్ద సోమవారం 2 కిలోల గంజాయితో పట్టుబడిన ఒడిశా రాష్ట్రం ఘాటి గూడ గ్రామానికి చెందిన బిటున్‌హాసన్‌ను అరెస్టు చేశామని డీఎస్పీ వి.వెంకట అప్పారావు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఈయన కేరళలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నప్పుడు అదేరాష్ట్రానికి చెందిన సుబ్రాత్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఒడిశాకు చెందిన అంబాజిహోలా అనే వ్యక్తి వద్ద గంజాయి కిలో రూ.3వేలు (మిగతా 4వ పేజీలో..)

గంజాయి మత్తులో బీభత్సం

● నరసన్నపేటలో వ్యాపారి, తండ్రిపై దాడి

నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో గంజాయి బ్యాచ్‌ల వీరంగంతో వ్యాపారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలో మంజునాథ పాన్‌షాపు వద్ద ముగ్గురు యువకుల గంజాయి మత్తులో షాపు యజమాని, అతని తండ్రిపై దాడి చేయడం కలకలంపై రేపింది. ఇందుకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసన్నపేటలోని జగన్నాథపురానికి చెందిన అజయ్, ప్రదీప్, వీరస్వామి గంజాయి మత్తులో సోమవారం రాత్రి మంజునాథ పాన్‌షాప్ వద్దకు వెళ్లారు. డబ్బులు ఇవ్వకుండా వాటర్‌బాటిల్, సిగరెట్టు అడిగారు. డబ్బులిస్తేనే.. వాటర్‌బాటిల్, సిగరెట్ ఇస్తానని షాపు యజమాని కోరాడ రాకేష్ చెప్పగా.. ఆయనపై పిడిగుద్దులతో దాడి చేశారు. అడ్డువచ్చిన రాకేష్ తండ్రిపై కూడా దాడికి పాల్పడ్డారు. షాప్‌లో ఫ్రిజ్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, గంజాయి మత్తులో వెనక్కి తగ్గకుండా అలజడి సృష్టించారు. బాధితుడు రాకేష్ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.


గాయపడిన రాజేష్

విచ్చలవిడిగా విక్రయాలు

నరసన్నపేటతోపాటు పరిసర ప్రాంతాల్లో కొంతమంది ఒడిశా నుంచి గంజాయిని దిగుమతి చేస్తూ.. (మిగతా 4వ పేజీలో..)



రాజేష్‌పై దాడి చేస్తున్న యువకులు (సీసీ ఫుటేజీ)

ఆ నెంబర్లు ఉంటే ఓకే

- ఇసుక లారీలకు స్టిక్కర్లు
- కమీషన్లు తీసుకుని వదిలేస్తున్న అధికారులు
- పలాసలో నయా దందా




పలాస వద్ద నెంబర్ ఉన్న లారీలో తెచ్చిన ఇసుకను ట్రాక్టర్‌లో డంపింగ్ చేస్తున్న దృశ్యం

పలాస, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. రవాణా చార్జీలు మాత్రం వినియోగదారులు చెల్లించాలి. అందుకు గాను నిర్మాణానికి సంబంధించిన పత్రాలు, ఆధార్ కార్డులు సమర్పిస్తే చాలు. కానీ పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో ఈ నిబంధనలు ఏవీ లేవు. అదనంగా డబ్బులు ఇస్తేచాలు.. ఇంటికి ఇసుక ఇస్తున్నారు. ఇతర వాహనాలు ఇక్కడకు నామమాత్రపు ధరకు ఇసుక ఇస్తే మాత్రం అధికారులకు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే లోకల్, నాన్‌లోకల్ వాహనాలను గుర్తుపట్టడానికి స్థానిక లారీలకు నెంబర్లు వేసి వాటిని అద్దాలకు అంటిస్తున్నారు. ఆ లారీల యజమానుల వద్ద కొంత మంది అధికారులు నెలవారీ కమీషన్లు తీసుకుని.. నెంబర్లు ఉన్న వాహనాలను విడిచిపెట్టేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నెంబర్లు లేని వాహనాలకు ఆంక్షలు విధిస్తూ.. అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో మొత్తం 45కు పైగా లారీలు, టిప్పర్లు ఉన్నాయి. అందులో అధికంగా వైసీపీ నాయకులకు చెందినవే. నరసన్నపేట, జలుమూరు, పర్లాం ర్యాంపుల నుంచి రోజూ వీటి ద్వారా 1300 టన్నుల ఇసుక ఇక్కడకు చేరుతోంది. ఒక్కో లారీ రూ.1700, టిప్పర్ రూ.1650కు విక్రయిస్తున్నారు. వీటిలో స్టిక్కర్ల నెంబర్లు ఉన్న లారీలకు రూ.2500 చొప్పున యజమానులు వసూలు చేస్తూ అధికారులకు ప్రతీనెలా కమీషన్ల రూపంలో ముడుపులు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లారీల యాజమాన్యం స్థానికంగా ఉన్నవాటికి గుర్తింపు కోసం నెంబర్లు వేసినట్లు చెబుతున్నా, వాస్తవానికి వాటి (మిగతా 4వ పేజీలో..)

మృత్యువులోనూ వీడని బంధం


- ట్రాక్టర్ బోల్తాపడి అక్కాతమ్ముడి దుర్మరణం
- ప్రాణాలతో బయటపడ్డ మరో నలుగురు
- లుకలాంలో విషాదం


ఆదినారాయణ, లక్ష్మి (ఫైల్)


కామేశ్వరిపేట వద్ద లోయలో బోల్తాపడిన ట్రాక్టర్


రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ అక్కాతమ్ముడు. ప్రతిరోజూ కూలీ పనులకు కలిసే వెళ్తారు.. కలిసే వస్తారు. ఆ వచ్చిన డబ్బులతో తమ కుటుంబాలను పోషించుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. అయితే, వారిని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ట్రాక్టర్ ప్రమాద రూపంలో వారిని బలితీసుకుంది. కామేశ్వరిపేట సమీపంలో మంగళవారం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో లుకలాం గ్రామానికి చెందిన అక్కాతమ్ముడు చోడి లక్ష్మి(38), గొడ్డు ఆదినారాయణ (35) మృతిచెందగా, డ్రైవర్‌తోపాటు మరో ముగ్గురు కూలీలు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. లుకలాం గ్రామానికి చెందిన ఆదినారాయణ, లక్ష్మి, జి.బంగారమ్మ, అశోక్, లంక శ్రీనివాసరావు అనే కూలీలు వంట కలపను లోడు (మిగతా 4వ పేజీలో..)



పాము..
ఈ పేరు వింటేనే హడలిపోతాం.
ఇక ఎదురుగా కనిపిస్తే అంతే సంగతులు.
వాస్తవానికి పాము మనం కనిపించిన వెంటనే తనకు తానుగా వచ్చి.. కాటు వేసిన సంఘటనలు ఉండవనే చెప్పాలి. తనకు హాని కలుగుతుందని భావించిన సమయంలోనో...మన కాళ్ల కింద పడడం వల్లనో కాటు వేసిన సందర్భాలే అధికం. కానీ భయంకొద్దీ మనం వాటిని అంతమొందిస్తుంటాం. దీనికి భిన్నంగా కొందరు వ్యక్తులు ఎలాంటి సర్పాన్నయినా ఇట్టే పట్టుకొని.. వాటికి ఎటువంటి హాని కలగకుండా.. అదే సమయంలో మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సురక్షితంగా వాటిని అడవుల్లో విడిచి పెడుతున్నారు.
బుధవారం ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా వారి గురించి తెలుసుకుందాం.

పాములను పట్టుకొని.. క్షేమంగా అడవులకు చేర్చి

- ఇది 'పాముల బాలయ్య' ప్రత్యేకత
- వేలాది సర్పాలను పట్టుకున్న వైనం

నేడు ప్రపంచ పాముల దినోత్సవం



పెద్దమడి వద్ద భారీ కింగ్‌కోబ్రాను పట్టుకుంటున్న ఓంకార్‌త్యాడి..

ఎంత పెద్ద పామైనా.. తల వంచాల్సిందే

- ఒడుపుగా పట్టుకోవడంలో దిట్ట ఓంకార్‌త్యాడి

సోంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి)

చిన్న పామును చూస్తేనే మనం భయపడి పోతాం. అల్లంత దూరం పారిపోతాం. మరీ తప్పనిసరైతే చంపేస్తాం. కానీ ఆ వ్యక్తి మాత్రం దీనికి భిన్నం. పెద్ద పెద్ద విష సర్పాలను సైతం ఒడుపుగా పట్టేస్తాడు. వాటికి ఏమాత్రం హాని తల పెట్టకుండా..క్షేమంగా సుదూర ప్రాంతాల్లోనో.. సమీప అడవుల్లోనో విడిచిపెడతారు. ఆయన పేరే రెల్ల బాలరాజు. ఉద్దానం ప్రజలు 'పాముల బాలయ్య'గా ప్రేమగా పిలుచుకునే ఆ వ్యక్తి సోంపేట మండల కేంద్రంలో ఉంటారు. ఒకవిధంగా చెప్పాలంటే పాములు పట్టడాన్నే వృత్తిగా చేసుకున్నారు బాలయ్య. ఆయనకు పంచాయతీ కొంత స్థలాన్ని కేటాయించింది. అక్కడే చిన్న వ్యాపారం చేసుకుంటూ...మరోవైపు పాములను పడుతూ జీవనం సాగిస్తున్నారు.

చిన్నతనం నుంచే...

చిన్నప్పటి నుంచే పాములను పట్టడం... వాటితో విన్యాసాలుల చేయడం అలవాటుగా చేసుకున్నానని చెబుతారు బాలయ్య. అనంతరం విషపూరిత పాములను సైతం చాకచక్యంగా పట్టుకొని... వాటి ప్రాణాలకు హాని కలగకుండా అటవీ ప్రాంతంలో విడిచి పెట్టేవారు. అలా పాములను పట్టడం వృత్తిగా మార్చుకున్నారు. ఇళ్లు.. పాఠశాలలు.. కార్యాలయాలు.. ఇలా ఎక్కడ విషపూరిత పాము ఉన్నా అక్కడికి చేరుకుంటారు బాలయ్య. వాటిని ఒడిసిపట్టుకొని మహేంద్రగిరుల్లో సురక్షితంగా విడిచిపెడతారు. దీని కోసం సంబంధిత వ్యక్తుల నుంచి కొంతమొత్తం తీసుకుంటారు. అలాగని తనకు ఇంత మొత్తం కావాలని డిమాండ్ చేయరు. ముఖ్యంగా మహేంద్రగిరులు, బీలలో మెట్టలు ఉన్న ఈ ప్రాంతంలో పాముల సంచారం అధికం. సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు ప్రాంతాల్లో పాములను పట్టి క్షేమంగా విడిచిపెడుతున్నారు.



పట్టుకున్న పాములతో బాలయ్య



ఉద్దేశపూర్వకంగా హాని చేయదు..

ఎంతటి విషపూరిత పామైనా తనకు తానుగా ఎవరికీ హాని చేయదు. వాటికి హాని కలిగిస్తున్నారని భావిస్తే మాత్రం కాటు వేస్తాయి. మనిషి కంటే పాములకే ఎక్కువ భయం. మనుషులు ఉండే చోటుకు మామూలుగా అవి రావు. చంపేస్తారని వాటికీ తెలుసు. దారి తప్పి జనారణ్యంలోకి వస్తాయి. మనుషుల శబ్దానికి పారిపోతాయి. అయినప్పటికీ వాటి వెంట పడుతుంటాం. అలాంటప్పుడు అవి కాటు వేస్తుంటాయి. పొలాల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రాణభయంతోనే కాటు వేస్తుంటాయి. మంత్రాలు, నాటువైద్యం నాకు తెలియదు. పాములు కాటు వేసిన చోట బ్లేడు లేదా చాకుతో కోసి... విషాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తా. గత 25 సంవత్సరాలుగా పాములను పడుతున్నా. ఇన్నేళ్లలో ఒక్క పామును కూడా చంపలేదు. పాములను పట్టుకొని మహేంద్రగిరుల్లో విడిచిపెడుతుంటాను. అతి ప్రమాదకరమైన కింగ్ కోబ్రాను కంచిలి మండలం బొగాబజీలో పట్టుకొని మహేంద్రగిరుల్లో విడిచిపెట్టాను. సోంపేటలోని మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. పాము తలభాగాన్ని చాకచక్యంగా పట్టుకుంటే ప్రమాదం ఉండదు. కొన్నిసార్లు పాముకాటుకు గురయ్యాను. ఎవరైనా పాముకాటుకు గురైతే బ్లేడుతో ఆ ప్రాంతాన్ని కోసి... విషపూరితమైన రక్తాన్ని బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించమని చెబుతా. ఇప్పటివరకు సుమారు 5000 వరకు పాములను పట్టుకొని సురక్షితంగా విడిచిపెట్టాను. ఎక్కడైనా పాము కనిపిస్తే 88971 00182నెంబర్‌కు కాల్‌చేస్తే వచ్చి పట్టుకొని... అడవుల్లో విడిచిపెడతా.

-రెల్ల బాలరాజు

పలాస, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అది మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల బాలుర పాఠశాల. కొద్ది నెలల కిందట ఉన్నట్టుండి భారీ కింగ్ కోబ్రా (వైరాగి నాగు) తరగతి గదుల్లోకి ప్రవేశించింది. 15 అడుగుల పొడవుతో ఉన్న ఈ సర్పం మన దేశంలో అత్యంత విషపూరితమైనది. అటువంటి భయంకరమైన పాము పాఠశాలలోకి చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పరుగులు తీశారు. ఇంతలో ఓ ఉపాధ్యాయుడు ఓ వ్యక్తికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. కొంతసేపటి తరువాత తన బృందంతో కలసి ఆ వ్యక్తి అక్కడికి చేరుకున్నారు. భారీ సర్పాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఆ వ్యక్తి పేరు ఓంకార్ త్యాడి. కాశీబుగ్గ బ్రాహ్మణ వీధిలో ఉంటారు. ఓంకార్‌త్యాడి ఈస్ట్రన్‌ఘాట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇటువంటి పాములను పట్టుకొని సమీప అడవుల్లో విడిచిపెడుతుంటారు. వీరికి జిల్లా అటవీ శాఖ అధికారులు పూర్తిగా సహాయకారులుగా నిలుస్తుంటారు.

ఎన్నో పాములు..

ఒక్క పెద్దమడిలోనే కాదు... అటువంటి కింగ్‌కోబ్రాలు జిల్లాలో ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో పట్టుకొని..అవి మనుగడ సాగించేందుకు వీలుగా సమీప అడవుల్లో విడిపెట్టారు. అరుదుగా కనిపించే కామన్ శాండ్‌బ్రో వంటి పాములను కూడా పట్టుకొని అడవుల్లో విడిచిపెట్టారాయన. పలాస మండలం వీరభద్రాపురం గ్రామంలో ఇటీవల ఇళ్ల సమీపంలో అలజడి సృష్టించిన రక్తపింజరి పాములు మొత్తం నాలుగింటిని పట్టుకొని అడవుల్లో విడిచిపెట్టారు. పలాస-కాశీబుగ్గకు సమీపంలోని టిడ్కో గృహ సముదాయంలోనికి ఇటీవల 15 అడుగుల పొడవైన భారీ కొండచిలువ రావడంతో సిబ్బంది పరుగులు పెట్టారు. అటవీశాఖ అధికారుల సాయంతో ఓంకార్ దాన్ని చాకచక్యంగా పట్టుకొని విడిచిపెట్టారు. మెళియాపుట్టి మండలంలో ఇటీవల భారీ కొండచిలువలు మూడింటిని పట్టుకొని అడవుల్లో విడిచిపెట్టి అటవీశాఖ అధికారుల మన్ననలు పొందారు. నాగుపాములు, ఇనపతుట్టలు, తాచుపాములను ఎన్ని పట్టుకున్నారో లెక్కే లేదంటారాయన. ఇటీవల అటవీశాఖ అధికారులకు పట్టుబడిన అలుదులు, పెంచుకునే పాములు, కోతులు, అడవి పిల్లులు ఓంకార్‌త్యాడి ఆధ్వర్యంలోనే అధికారులు అడవుల్లో విడిచిపెట్టి.. వాటికి స్వేచ్ఛను ప్రసాదించారు.



టిడ్కో గృహాల వద్ద 15 అడుగుల కొండ చిలువను పట్టుకున్న ఓంకార్‌త్యాడి (ఫైల్)

పర్యావరణానికి మేలు..

పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాములు ఎంతో దోహదం చేస్తాయి. ఎలుకల సంతాన నియంత్రణ, వ్యాధుల వ్యాప్తిని నివారించడంలో పాములు చాలా అవసరం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 3,789 రకాల జాతుల పాములు ఉన్నాయి. మన దేశంలో మాత్రం 300 పాముల జాతులు ఉన్నాయి. కింగ్‌కోబ్రా, ఇండియన్ కోబ్రా, రస్సెల్ వైపర్ (రక్త పింజరి) ప్రమాదకరమైనవి. ఇటీవల దేశంలో పాముల రక్షణ, పునరావాసాల కోసం కార్యక్రమాలు చేపడుతున్నా... వాటిని సంరక్షించుకోలేకపోతున్నాం.

-ఓంకార్ త్యాడి

ప్రపంచంలో విషపూరిత పాములు..

బ్లాక్‌మాంబ, బూమ్స్‌లాంగ్, ఫెర్‌డిలాన్స్, రస్సెల్ వైపర్, తూర్పు టైగర్ స్నేక్, సాస్కేల్డ్ వైపర్, బ్యాండెడ్‌క్రైట్, కింగ్‌కోబ్రా, కోస్టల్‌తైపాన్, ఇన్‌ల్యాండ్ తైపాన్‌లు ఉన్నాయి.

మన దేశంలో ..

కింగ్‌కోబ్రా, ఇండియన్ క్రైట్, రస్సెల్‌వైపర్, సాస్కేల్డ్‌వైపర్, ఇండియన్ కోబ్రా, మలబార్ పిట్‌వైపర్, బ్యాండెడ్‌క్రైట్, వెదురుపిట్‌వైపర్, హంప్‌నోస్డ్ పిట్‌వైపర్, అండమాన్‌పిట్‌వైపర్.



డే అండ్ నైట్ నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్‌జాం

నగరం.. ట్రాఫిక్ దిగ్బంధం

(మూడో పేజీ తరువాయి)

ఆర్టీసీ కాంప్లెక్స్, జిల్లా కోర్టు సముదాయం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థలు, ఎస్పీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఇలా ఎన్నో సంస్థలు ఉన్నాయి. దీంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగు తీసి అడుగు వేయలేనంతగా పరిస్థితి ఉంటుంది. అయితే, ఇరుకైన రోడ్లతోపాటు ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రతిరోజూ గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్ దిగ్బంధనంలో చిక్కుకుంటున్నాయి.

కార్పొరేషన్‌గా మారినా...

శ్రీకాకుళం మునిసిపాలిటీని దశాబ్ద కాలం కిందట నగరపాలక సంస్థగా మార్చారు. విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నప్పుడే నగ రంలోని ప్రధాన జంక్షన్లను రూ.70కోట్లతో విస్తరించేందుకు ముందుకు వచ్చింది. అందులో భాగంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదటి దశలో డేఅండ్‌నైట్, ఏడురోడ్ల, రామలక్ష్మణ, పొట్టి శ్రీరాములు కూడళ్లను విస్తరించేందుకు టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారై కాంట్రాక్టర్లు కూడా ముందుకు వచ్చారు. కానీ, స్థల సేకరణ విషయంలో నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో టెండర్ల కాలపరిమితి పూర్తయింది. తర్వాత టీడీపీ ప్రభుత్వం మారడం, శ్రీకాకుళం నగరం.. సుడా పరిధిలోకి రావడం, నిధులు కొరత వంటి అంశాలతో ఈ పనులు ముందుకు సాగలేదు

పట్టించుకోని గత ప్రభుత్వం..

శ్రీకాకుళం నగర అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలో మంత్రిగా వ్యవహరించిన ధర్మాన ప్రసా దరావు తన నియోజకవర్గ కేంద్రం శ్రీకాకుళంలో అభివృద్ధిని విస్మరించారనే విమర్శలు ఉన్నాయి. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, సుందరీకరణలో భాగంగా జంక్షన్లను విస్తరించాలని పలుమార్లు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినా గత ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గతంలో నగర పాలకసంస్థలో పనిచేసిన అధికారుల చొరవతో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒక సర్వే చేశారు. వారిచ్చిన ప్రతిపా దనలను సైతం అప్పటి వైసీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. నగరంలో రోడ్ల విస్తరణకు సంబంధించి పదేళ్లుగా ప్రతిపాదనలు చేయడం.. బుట్టదాఖలు కావడం పరిపాటిగా మారింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ట్రాఫిక్ సమస్యపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

దృష్టి సారించాం..

ప్రైవేటు బస్సుల సిబ్బందిపై దృష్టిపెట్టాం. వారు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి అడుగు పెట్టకుండా నిఘా పెంచాం. ఇందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

-విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి, శ్రీకాకుళం

కిలో గంజాయి రవాణాకు రూ.5వేలు

(మూడో పేజీ తరువాయి)

చొప్పున కొనుగోలు చేసి సుబ్రాత్‌కు రూ.10వేలకు విక్రయించడానికి తీసుకువెళ్తుండగా పోలీసులకు చిక్కాడు. బిటున్‌హాసన్‌ను అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు. గంజాయి రవాణా చేసినా, అమ్మినా తీవ్రమైన నేరంగా పరిగణిస్తామన్నారు. గంజాయితో పట్టుకుంటే కనీసం పదేళ్ల జైలు, రూ.2లక్షల అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. గంజాయి స్మగ్లర్ల ఆస్తులు కూడా జప్తు చేసే అవకాశం ఉందన్నారు.

గంజాయి మత్తులో బీభత్సం

(మూడో పేజీ తరువాయి)

విచ్చలవిడిగా విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. చీకటి అయితే చాలు.. గంజాయి మత్తులో యువత అరాచకాలు ఎక్కువవుతున్నాయని వ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి బ్యాచ్ నుంచి తమకు రక్షణ కల్పించాలని వ్యాపారులు నరసన్నపేట సీఐకి వినతిపత్రం అందజేశారు. అలాగే గంజాయి మత్తులో వ్యాపారులపై దాడి అమానుషమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దాడికి పాల్పడిన యువకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

పాపం.. చిన్నారులు!

- నాడు అనారోగ్యంతో తల్లి.. నేడు ప్రమాదంలో తండ్రి మృతి
- అనాథలైన ఆడపిల్లలు

నరసన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అమ్మానాన్నల వద్ద అల్లారుముద్దుగా పెరుగుతున్న ఆ చిన్నారులను చూసి విధికి కన్నుకుట్టిందేమో. ఏడాది క్రితం అనారోగ్యం రూపంలో తల్లిని.. సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం రూపంలో తండ్రిని వారికి దూరం చేసింది. దీంతో అభం శుభం తెలియని ఆ ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దేవాది గ్రామానికి చెందిన బండి కృష్ణ (38) మడపాం టోల్‌ప్లాజా సమీపంలో టైర్ల షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి మడపాం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. దేవాది ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణకు తలపై బలమైన గాయాలయ్యాయి. స్థానికులు నేషనల్ హైవే అంబులెన్స్‌లో నరసన్నపేట ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. కృష్ణ భార్య స్వాతి ఏడాది క్రితం అనారోగ్యంతో కన్నుమూసింది. వీరికి మోహిని, యోగిత అనే కుమార్తెలు ఉన్నారు. మోహిని ఎనిమిది, యోగిత ఆరో తరగతి చదువుతున్నారు. తల్లి దూరమైనప్పటి నుంచి పిల్లలిద్దరూ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కృష్ణ బతుకుతెరువు కోసం చిన్నతనంలో సారవకోట మండలం బద్రి నుంచి దేవాదిలో ఉంటున్న తాతగారి ఇంటికి వచ్చేశాడు. అదే గ్రామానికి చెందిన స్వాతిని వివాహం చేసుకున్నాడు. ఆమె మరణంతో తల్లీతండ్రీ అన్నీ తానై... పిల్లలను సాకుతూ వచ్చాడు. ఇంతలోనే కృష్ణ మృత్యు వాత పడడాన్ని గ్రామస్థులు... కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు.



బండి కృష్ణ (ఫైల్)



తల్లితో పిల్లలు మెహిని, యోగిత (ఫైల్)

మృత్యువులోనూ వీడని బంధం

(మూడో పేజీ తరువాయి)

చేసేందుకుగాను మంగళవారం ఉదయం 9 గంటలకు స్వగ్రామం నుంచి ట్రాక్టర్‌పై వెంకటాపురానికి బయలుదేరారు. ట్రాక్టర్‌ను స్వామి అనే డ్రైవర్ నడుపుతున్నాడు. ట్రాక్టర్ కొల్లవానిపేట రైల్వేగేటు దాటిన తరువాత కామేశ్వరిపేట గ్రామ సమీపంలోకి వెళ్లే సమయంలో ఒక్కసారిగా ఇంజన్ ముందు టైరు పంక్చరైంది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు- రైల్వే మార్గానికి మధ్యలో ఉన్న చిన్నలోయలో బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రక్కు కింద చిక్కు కుని ఆదినారాయణ, ఇంజన్ కిందపడి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా కూలీలు బంగారమ్మ, అశోక్, శ్రీనివాసరావుతోపాటు డ్రైవర్ స్వామి ట్రాక్టర్ నుంచి బయటకు గెంతేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న లుకలాం గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆదినారాయణ, లక్ష్మి మృతదేహా లను చూసి కుటుంబ సభ్యులు రోదించారు. వారి మృతితో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయని తల్లి వరహాలమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆదినారాయణకు భార్య గన్నెమ్మ, బాబు, పాప ఉండగా, లక్ష్మికి భర్త చిన్నారావు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలాకి ఎస్ఐ రంజిత్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అక్కాతమ్ముడు లక్ష్మి, ఆదినారాయణ మృతి చెందడంతో లుకలాంలో విషా దఛాయలు అలముకున్నాయి.



ఆలయం వద్ద ఘటాలతో బారులు తీరిన భక్తులు

ఘనంగా నీలమణి దుర్గ వారోత్సవం

పాతపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని శ్రీ నీలమణిదుర్గ ఆవేటి వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా వ్యవసాయ పనులకు ముందు రైతులు అమ్మవారికి మురాటలు చెల్లించి.. వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళవారం ఉత్సవాన్ని నిర్వహించారు. నీలమణి దుర్గ ముఖచిత్రం ఉన్న ఘటాలలో మొక్కుబడుల సామగ్రిని నింపి.. దీపాలు వెలిగించి... కొబ్బరి పువ్వులతో అలంకరిస్తారు. ఈ ఘటాలతో మహిళలు అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళతారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. మంగళవారం ప్రతి ఇంటి నుంచి ఒకరు, ఇద్దరు చొప్పున మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరారు. బాజాభజంత్రీలు, గజముద్దలతో మురాటలు చెల్లించేందుకు భక్తులు బారులు తీరారు. ప్రధాన రహదారికి ఎగువనున్న వీధుల ప్రజలు ఒక వైపు... దిగువనున్న ప్రజలు మరోవైపు నుంచి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు.

బతికున్నోళ్లను చంపేశారు..!

- మెళియాపుట్టిలో సచివాలయ సిబ్బంది నిర్వాకం
- తల్లికి వందనం పడకపోవడంతో ఆందోళన చెందుతున్న లబ్ధిదారు

- మెళియాపుట్టి రెడ్డిక వీధికి చెందిన మూగ కృష్ణవేణికి ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు మోక్షిత్ ఆరో తరగతి చాపరలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. చిన్న కుమారుడు షారూక్ కూడా చాపరలో మూడో తరగతి చదువుతున్నాడు. అయితే వైసీపీ ప్రభుత్వం హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో కుటుంబం లేనట్లు చూపించడంతో పథకాలకు దూరం కావడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పిల్లలు చనిపోయినట్లు చూపించడంతో తల్లికి వందనం పథకం కూడా వీరికి అందలేదు.



ఇద్దరు కుమారులతో కృష్ణవేణి

మెళియాపుట్టి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తల్లికి వందనం పథకం పేరుతో చేపట్టిన కార్యక్రమం అమలు నీరు గారుతోంది. ఈ పథకం కింద తల్లుల ఖాతాలో రూ.13 వేలు జమచేస్తున్న విషయం విదితమే. అయితే మెళి యాపుట్టిలో సచివాలయ సిబ్బంది నిర్వాకం వల్ల ఆన్‌లైన్‌లో బతికున్న వారిని చంపేసినట్లు చూపిస్తోంది. దీంతో తల్లికి వందనం పథకానికి దూరం కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తల్లికి వందనం అర్హుల జాబితాలో పేర్లు ఉన్నట్లు సచివాలయ సిబ్బంది మొదట తెలియజేశారు.అయితే పేర్లు ఉన్నా డబ్బులు ఖాతాలో జమకాకపోవడంతో సచివాలయం చుట్టుతిరుగున్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. అయితే కృష్ణవేణి సోమవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్టేటస్‌ను పరిశీలించగా రిమార్కర్‌లో విద్యార్థులు చనిపోయినట్లు చూపించడంతో ఆందోళన చెందారు. దీంతో కృష్ణవేణి తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండాకు ఫిర్యాదుచేశారు. కాగా మ్యాపింగ్‌లో తప్పిదం జరిగిందని, పరిశీలించి లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అందజేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రతాప్ పండా తెలిపారు.

ఆ నెంబర్లు ఉంటే ఓకే!

(మూడో పేజీ తరువాయి)

వెనుక ఉద్దేశం వేరుగా ఉందనే ప్రచారం సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఇసుక రవాణా వాహనాలను తనిఖీ చేయకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చారా, దేని అవసరాలకు వాటిని వినియోగిస్తున్నారు, ఎంత పరిమాణంలో ఇసుక తీసుకువస్తున్నారనే వివరాలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తున్నారు. కొంతమంది అవసరంబట్టి అధనపు ధరలకు అమ్ముకుంటుండడంతో భవన నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు.

- గత ప్రభుత్వ హయాంలో జాతీయరహదారికి అనుకొని కోసంగిపురం గ్రామ రోడ్డులో ఇసుక అమ్మకం కేంద్రాలు ఏర్పాటు చేసి వినియోగదారులకు నేరుగా ప్రభుత్వమే విక్రయించేది. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల మేరకు నేరుగా ర్యాంపుల నుంచి ఇసుక తీసుకోవచ్చు. ఇందులో ఉన్న లోపాలు కారణంగా లారీ, ట్రిప్పర్ల యజమానులు ఇష్టారాజ్యంగా ఇసుకను రవాణా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు ప్రతినెలా ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలు, ట్రిప్పర్లపై మాత్రం ఆంక్షలు విధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల

టెక్కలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇరు పార్టీలకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి కేసులు రాజీ చేసుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంఘం చైర్‌పర్సన్ బి.నిర్మల కోరారు. మంగళవారం టెక్కలిలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన మీడియేటర్స్ డీవీ వివేకానంద, ఎస్.దివాకర్, ఎ.వైకుంఠరావు, డి.భుజంగరావు, ప్యానెల్ న్యాయవాది మెట్ట గోవింద్, ఎస్ఐలు కె.రాము, షేక్‌మహ్మద్ ఆలీ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో..

● కోటబొమ్మాళి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని న్యాయవాదుల సంఘం మండల అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కోటబొమ్మాళిలోని కోర్టు ఆవరణలో కక్షిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.నర్సింహ మూర్తి, పూజారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కేసుల భారం తగ్గించేందుకే..

పొందూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరిగిపోతున్న కేసులు, కోర్టుల్లో పెండింగ్ కేసుల ను తగ్గించేందుకే సుప్రీంకోర్టు 'మధ్యవర్తిత్వం- దేశం కోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. ఈ మేరకు దీనిపై అవగాహన కలిగించేందుకు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంతో కక్షిదారులకు కేసుల నుంచి విముక్తితో పాటు ఆర్థిక ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రతి శుక్ర, సోమ వారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్, కె.మంజుల, సురేష్, కోర్టు సిబ్బంది, గ్రామ స్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారి జ్యోత్స్న, న్యాయవాదులు

మునిసిపల్ కమిషనర్‌గా రవి

ఆమదాలవలస, జూలై 15(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్‌గా తమ్మినేని రవి మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన పూజారి బాలాజీ ప్రసాద్ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రవి నియమితులయ్యారు.



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రవి



ఊరేగింపుతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

నగరంలో ఆవేటి వారాల సందడి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ఆవేటి వారాల సందడి నెలకొంది. బలగ భద్రమ్మ గుడి, ఏపీహెచ్‌బీ కాలనీలోని అసిరమ్మ, కిన్నెర థియేటర్ సమీపంలోని ముత్యాలమ్మ అమ్మవార్ల ఆవేటి సంబరాలను భక్తులు అంగ రంగవైభవంగా నిర్వహించారు. భక్తులు కలశా లతో భారీ ఊరేగింపులతో ఆలయాలకు వచ్చి అమ్మవార్లకు చల్లదనం చేసి మొక్కులు చెల్లించు కున్నారు. అమ్మవార్ల పాదాలు కడిగి ప్రత్యేక పూజ లు చేసి వివిధ రకాల పుష్పా లతో అలంకరించారు. ఫాజుల్‌బేగ్ పేటలోని భద్రమ్మ తల్లికి అర్చకులు పన్నాల నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి జంగిడీలు మోస్తూ తల్లి వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నీలమ్మ తల్లి, నక్కవీధిలో ఉన్న ఉమాదేవికి కోదండ రామాలయంలో ఉన్న లక్ష్మీదేవికి మహాలక్ష్మి కాలనీలో ఉన్న కాత్యాయని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుల వాయిద్యాలతో భారీ ఊరే గింపులు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.



ఘటాలను తీసుకువెళుతున్న భక్తులు

డిసెంబరు 31 నాటికి టిడ్కో గృహాల పంపిణీ

ఇచ్ఛాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ టిడ్కో గృహాలను అందజేస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, ఎమ్మెల్యే, విప్ బి.అశోక్ అన్నారు. రాష్ట్రంలో 70 వేల మంది లబ్ధిదారులకు టిడ్కో గృహ సముదాయాలు అప్పగిస్తామని తెలిపారు. మంగళవారం మున్సిపాల్టీ పరిధి ఏఎస్‌పేట (బోర్డర్)లోని టిడ్కో గృహలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగానే టిడ్కో గృహాలు పూర్తి కాలేదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ టిడ్కో గృహాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ గృహాల కోసం డీడీల రూపంలో డబ్బు చెల్లించిన ప్రతి లబ్ధిదారుడికీ గృహాలు అందిస్తామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ. 16,280 కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, టీడీపీ పట్టణ కార్యదర్శి నందిగాం కోటి, మున్సిపల్ కమిషనర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్, ఎమ్మెల్యే తదితరులు

ఆదర్శనీయుడు కేఎస్ తిలక్

శ్రీకాకుళం కల్చరల్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సముపా ర్జనలో గాంధీ పిలు పు మేరకు యువత ను ఉత్తేజపరచడంలో కేఎస్ తిలక్ కీలకపాత్ర వహిం చారని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్ర్య సమర యోదుడు, తొలి పార్లమెంట్ సభ్యుడు కందాళ సుబ్రహ్మణ్య తిలక్ (కేఎస్‌తిలక్) 105వ జయంతిని మంగళవారం . శాంతి నగర్ కాలనీలోని గాంధీ స్మృతివనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రొఫెసర్ డా.నిక్కు అప్పన్న తదితరులు మాట్లాడుతూ.. నీతి నిజాయితీతో వ్యవహరించి ప్రజాసేవకు పాల్పడిన తిలక్ ఆదర్శనీయుడన్నారు. గాంధీ మందిర ప్రతినిధులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, నటుకుల మోహన్, శాస్త్రి, నిష్టల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలుచేస్తున్నాం



పద్ద గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని టీడీపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పద్ద గ్రామంలో సూపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు, టీడీపీ నాయకులు వెంకట్రావు అనపాన రాజశేఖరెడ్డి పాల్గొన్నారు. అలాగే కొలిగాం పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, పైల లచ్చన్నయ్య, పండా, భాస్కరరావు, తేజరావు, విష్ణపండా, ప్రసాద్‌పండా పాల్గొన్నారు.



కొలిగాం కరపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజల రుణం తీర్చుకోవడమే లక్ష్యం: శంకర్

అరసవల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి: తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడమే జీవిత లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా రూరల్ మండలం కుందువాని పేటలో ప్రతీ ఇంటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో చేసిన అభివృద్ధి పనులు, పథకాలను వివరించారు. అనంతరం హుద్ హుద్ తుపాను బాధిత కుటుంబాలకు మంజూరైన 96 ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసత్యాలను ప్రచారం చేస్తే సహించేది లేదు

● టీడీపీ నియోజకవర్గ నేతలు

అరసవల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని నియోజకవర్గ టీడీపీ నేతలు హెచ్చరించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం నేతలు విలేకరులతో మాట్లాడా రు. మోసం చేయడం ఒక్క జగన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. ఏడాది కూటమి పాలనలో అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తుంటే, ఏ రకమైన అభివృద్ధీ జరగలేదని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. అబద్ధాలను ప్రజలు ఎంతకాలం నమ్ముతారని ప్రశ్నించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు గొండు రమణమూర్తి, పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, ఎస్వీ రమణ మాదిగ, సింతు సుధాకర్, అంధవరపు సంతోష్, కవ్వాడి సుశీల, మూకళ్ల శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు

వర్షం.. రైతన్నల్లో హర్షం

సోంపేట/కంచిలి/కవిటి/ఇచ్ఛాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రతతో ఉక్కపోతకు గురైన ప్రజలకు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో ఖరీఫ్ కోసం వరి విత్తనాలు వేసిన రైతులకు ఈ వర్షం ఉపయోగపడింది. ఇటీవల ఎండలకు వరి పంట ఎండిపోతున్న సమయంలో వర్షం కురవటం రైతుల్లో ఆశలు చిగురించాయి. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. కవిటి మండలం బీలప్రాంతంలో ఉభాలు చేసుకునేందుకు ఈ వర్షం కొంత మేర అనుకూలంగా ఉంటుందని, మెట్ట ప్రాంతంలో ఆకుమడులు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షం ఉపయోగపడిందని రైతులు చెబుతున్నారు. ఇచ్ఛాపురంలో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.



కవిటిలో కురుస్తున్న వర్షం



← సోంపేటలో..

రైతులందరికీ ఎరువులు



ఎరువులను అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఖరీఫ్ సాగు చేసే రైతులకు ఎరువులు సరఫరా చేస్తామని నారాయణపురం ఆనకట్ట చైర్మన్, టీడీపీ జిలాల కార్యదర్శి ఎస్.తిల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం కొర్లకోటలో రైతులకు ఎరువులు పంపిణీ చేపట్టారు. కొంతమంది వ్యక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, అందరికీ ఎరువులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రా ఆర్గానిక్స్‌లో మాక్‌డ్రిల్

రణస్థలం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పైడి భీమవరం పరిధిలో అంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమలో మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అమ్మోనియా టాంకర్‌ను దించుతున్నప్పుడు సాల్వెంట్ యార్డ్‌లో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం మంచి పనితీరును ప్రదర్శించింది. భద్రతా చర్యలు, అత్యవసర స్పందన ప్రొటోకాల్‌ను ప్రదర్శించారు. ఈ కార్య క్రమంలో పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణయ్య, ఈహెచ్‌ఎస్ మేనేజర్ ఎస్.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు ఆదేశాల మేరకు ఈ మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు.

ఉపాధి అవకాశాలు లక్ష్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యమని డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్‌రావు అన్నారు. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నగరంలోని స్కిల్ హబ్ హాలులో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్య క్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, ఎన్‌వైకె డీడీ వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో వీవీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల తో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. పీజీ చదువుతున్న పేద విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్- 77ను రద్దు చేయాలన్నారు. ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలు అందితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు చెబుతుండడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, సహాయ కార్యదర్శి హరికృష్ణ, సంతోష్‌కుమార్, నందు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు అభినందన



అశోక్ గజపతిరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జూలై 15(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. విజయ నగరంలోని బంగ్లాలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, లంక ప్రభ, వద్దాది శ్రీను, లుకలాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం భవానీపురం గ్రామం సమీపంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారాతో సుమిత్ర నాయకోను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. జన్నాఘయి గ్రామంలో నల్ల హరిబందు వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ సీఐ మధుకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ డిమాండ్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

అరసవల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవ స్థాపకుడు వీజీకే మూర్తి జయంతి సందర్భంగా సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదన్నారు. పి.సుధాకరరావు, కేఎస్ రామకృష్ణ అట్టాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సింగుపురంలో చైన్ స్నాచింగ్


శ్రీకాకుళం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చలుమూరు వెంకట కుమారి పింఛన్ తీసుకునేందుకు యూనియన్ బ్యాంకుకు వెళ్లి తిరిగి 5 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా హైస్కూల్ సమీపంలో మాస్కులు ధరిం చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌ను లాక్కుని పరారయ్యారు. వెంటనే స్థానికులు పోలీ సులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సోంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అప్పలస్వామి, హెచ్చరించారు. మంగళవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ భవానీ శంకర్, ఏవో బి.నరసింహమూర్తి ఉన్నారు.

మత్తుపదార్థాలతో అనర్థాలు

బూర్జ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల అనారోగ్యం బారిన పడతారని సీఐ సత్యనారాయణ అన్నారు. పెదలంకాంలో మంగళవారం వివిధ అంశాలపై గ్రామస్థులకు అవగాహన కలిగించారు.



నిలిచిపోయిన మెట్టూరు బిట్-3 సచివాలయ భవనం

పనులు పూర్తి కాక.. వసతి లేక

● అర్థాంతరంగా నిలిచిపోయిన వైనం ● మెట్టూరు బిట్-3 గ్రామ సచివాలయం దుస్థితి

కొత్తూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టూరు బిట్-3 పంచాయతీ పరిధిలో పనులు పూర్తికాకపోవడంతో ఇక్కడ సచివాలయం నిర్వహణకు వసతి సమస్యవేధిస్తోంది. ఇక్కడ నూతన భవననిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోవడంతో సచివాలయ సిబ్బంది వేరే చోట విధులు నిర్వహించవల్సి వస్తోంది.ఐదేళ్ల కిందట సచివాలయ నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.40 లక్షలు మంజూరయ్యాయి.భవన పనులను 2023లో ప్రారంభించిన తర్వాత మందకొడిగా సాగాయి. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం భవనానికి రంగులు, ప్లాస్టింగ్‌లు పూర్తయినా కిటికీలు, డోర్లు మాత్రం వేయాల్సి ఉంది.ఆ పనులు పూర్తయితే సచివాలయ సిబ్బందికి వసతి సమస్య తీరనుంది.తక్షణమే అధికారులు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా సచివాలయ భవనం పనులు ముగింపు దశలో ఉన్నాయని, ఇప్పటికి 60శాతం బిల్లు చెల్లించామని మండల పరిషత్ జేఈ దుర్గాప్రసాద్ తెలిపారు. పెండింగ్ పనులు చేసిన తరువాత మిగిలిన బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపడతామని పెడతామని చెప్పారు.

ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలు

● పోలీసులకు పట్టుబడిన అనకాపల్లికి చెందిన మహిళ

పలాస, జూలై 15(ఆంధ్రజ్యోతి): బస్సులు, రైళ్లు, ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలనే లక్ష్యంగాచేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళ కాశీబుగ్గ పోలీసులకు సోమవారం రాత్రి పట్టుబడింది. ఆమె నుంచి రూ.6.5 లక్షల విలువైన ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు విలేకరులతో మాట్లాడారు.డీఎస్పీ కథనం మేరకు.. పలాసకు చెందిన రోహిణి జూన్ నాలుగో తేదీన శ్రీకాకుళం నుంచి బస్సులో పలాస వస్తుండగా బ్యాగు దొంగతనానికి గురైందని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈమేరకు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ బస్టాండు, రైల్వేస్టేషన్, ఆటోస్టాండ్‌పై నిఘాపెట్టారు. ఆయా ప్రాంతాల్లోని సీసీకెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని సేకరించగా దొంగతనం చేసింది మహిళ అని గుర్తించారు.దీంతో ఆమెకోసం వెతకడం ప్రారంభించారు. ఈక్రమంలో అనకాపల్లికి చెందిన పరుపల్లి దుర్గను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు. పోలీసులు ప్రశ్నించడంతో టెక్కలిలో బస్సు ఎక్కినట్లు, రోహిణి హడావుడిలో దిగుతున్న సమయంలో ఆమె పర్సును దొంగిలించినట్లు దుర్గ అంగీకరించింది.బ్యాగులోఆరుతులాల బరువున్న రెండుబంగారు హారాలు ఉన్నాయి. పరుపల్లి దుర్గపై అనేక కేసులు గతంలో నమోదయ్యాయి. దీంతోపాటు ఆమె జైలు జీవితాన్ని కూడా అనుభవించింది. శ్రీకాకుళం రెండోపట్టణ, గాజువాక, అనకాపల్లి పోలీస్‌స్టేషన్, అనకాపల్లి రైల్వేపోలీస్ స్టేషన్, నర్సీపట్నం, చోడవరం, నెల్లిమర్లతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లలో ఆమెపై నేరారోపణలు ఉన్నాయి. దుర్గను పలాస కోర్టులో హాజరుపరిచారు. కేసును ఛేదించిన సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బందికి అభినందించారు.

పాముకాటుకు గురై మహిళ మృతి

టెక్కలి,జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతాపురానికి చెందిన మూల నారాయణమ్మ(75) పాముకాటుతో అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగానే ఆమె మృతిచెందింది. ఇంట్లోని చెప్పుల స్టాండ్‌లో చెప్పులు తీసేందుకు చేయి పెట్టడంతో నాగుపాము కాటేసింది. నారాయణమకు కంటిచూపు మందగించడంతో పామును గమనించలేకపోయింది.

పేకాట ఆడిన నలుగురిపై కేసు నమోదు

ఎల్.ఎన్.పేట, జూలై 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోవిలాం చెత్త నుంచి సంపద తయారీకేంద్రం వద్ద పేకాటఆడుతున్న నలుగురిపై కేసు నమోదుచేసి వారి నుంచి తొమ్మిదివేల నాలుగవందల ముప్పైరూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. అలాగే తురకపేట జంక్షన్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న కె. గోవిందరావు, కె. డిల్లీశ్వరరావు, కె. ధర్మారావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తండ్రికి తలకొరివిపెట్టిన కుమార్తె

ఎల్.ఎన్.పేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామలాపురంలో మంగళవారం తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్యామలాపురానికిచెందిన ఇప్పిలి జగదీశ్వరరావు(49) ఆదివారం సాయంత్రం పాముకాటుకుగురై మృతి చెందాడు.జగదీశ్వరరావుకు భార్య భానుమతి, కుమార్తె లావణ్య ఉన్నారు. రెండేళ్ల కిందట కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమార్తెకు వివాహం కావడంతో భర్తతో లండన్‌లో ఉంటోంది. జగదీశ్వరరావు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న లావణ్య భర్తతో సోమవారం రాత్రికి గ్రామానికి చేరుకొని మంగళవారం అంత్యక్రియలు నిర్వహించింది.



తలకొరివి పెడుతున్న లావణ్య

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

టెక్కలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో వ్యవసాయశాఖ, విజిలెన్స్ యంత్రాంగం మంగళవారం విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీచేశాయి. ఆయా షాపుల్లో అధికారులు స్టాక్ రిజిస్ట్రార్, బిల్లు పుస్తకాలు, దస్త్రాలు, గోదాములు తనిఖీ చేశారు. హోల్‌సేల్, రిటైల్ అమ్మకాల పత్రాలు సరిగ్గా నిర్వహించకపోవడంతో వైశ్యరాజు వెంకటరాజు దుకాణంలో లక్ష రూపాయల ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు.తనిఖీల్లో వ్యవసాయశాఖ సహాయసంచాలకుడు బొడ్డేపల్లి విజయ్‌ప్రసాద్, విజిలెన్స్ సీఐ ఆడారి సంతోష్‌కుమార్, ఏవో ఎన్.శ్రీనివాసరావు, జిల్లా వనరుల కేంద్రం నుంచి ఏడీ సీహెచ్ వెంకట్రావు, వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్ పాల్గొన్నారు.



టెక్కలి: దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

●నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని శ్రీరామ ఫెర్టిలైజర్స్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. రూ.4.04 లక్షలు విలువ చేసే కలుపు మందుల విక్రయం నిలిపివేశారు.571 లీటర్ల కలుపు మందును సీజ్‌చేశారు. లైసెన్స్ ప్రకారం ఇవ్వాల్సిన రిపోర్టులు సరిగా సబ్‌మిట్ చేయకపోవడంతో అమ్మకాలను నిలిపివేసినట్లు ఏవో సూర్యకుమారి తెలిపారు.

పెట్రోల్ బంకు వద్ద వాహనచోదకుల నిరసన

నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని ఓ పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనదారులు మంగళవారం రాత్రి నిరసనకు దిగారు. యాతపేటకు చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు లీటర్ పెట్రోల్‌ను బాటిల్‌లో కొట్టించగా అందులో 200 మిల్లీలీటర్లు మాత్రమే పెట్రోల్ ఉండగా మిగతా భాగం నీరు ఉండడంతో బంకు సిబ్బందిని నిలదీశాడు. దీంతో అక్కడకు చేరుకున్న చోదకులు ఇక్కడ వాహనాలకు ఇంధనం నింపిన తర్వాత కొద్ది దూరం వెళ్లి నిలిచిపోతున్నాయని ఆందోళన చేపట్టారు.

చెరువుల్లో ఆక్రమణలు తొలగించండి

వజ్రపుకొత్తూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ సీతారామయ్యకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కోరారు. మంగళవారం మండల సమావేశం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన జరిగింది. డోకులపాడు సర్పంచ్ వడ్డిసరిత, ఎంపీటీసీ కొయిరి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చెరువుల ఆక్రమణలపై పత్రికల్లో కథనాలువస్తున్నా అధికారులు తొలగించడంలేదని ప్రశ్నించారు.వెంకటాపురంలో పశువైద్య భవనం పనులు పూర్తి చేయాలని మండలకోఆప్షన్ సభ్యుడు మరడ భాస్కరరెడ్డి కోరారు. ఆర్‌అండ్‌బీ అధికారులుసమావేశానికి రాకపోవడంపై మండల ప్రత్యేకఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ నిలదీశారు.ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై సమాధానం చెప్పడానికి అధికారులు రాలేదని ఈ విషయంపై ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ప్రజలల్లో అవగాహన కల్పించకుండా మట్టినమూనాలు పేరుతో గ్రామాల్లో సర్వేబృందాలు రావడంపై ఆ ప్రాంత ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, ఈఓఆర్డీ తిరుమలరావు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

మెళియాపుట్టి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ పాఠశాలలో చదివి ట్రిబుల్‌ఐటీలో సీటు సంపాదించిన రాజాన ఇంద్రజకు పాఠశాల కమిటీ చెర్మన్ బి.చిన్నారాబాబు, హెచ్‌ఎం మహాలక్ష్మి అభినందించారు.

●ఎల్.ఎన్.పేట, జూలై 15(ఆంధ్రజ్యోతి):కొమ్మువలసకు చెందిన శిమ్మ జాహ్నవి ఒంగోలులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికకావడంతో ఎంఈవోలు మణికుమార్, కె.చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లు: ఎమ్మెల్యే



టిడ్కో గృహాల సమస్యలను చైర్మన్ అజయ్‌కుమార్‌కు వివరిస్తున్న శిరీష

పలాస, జూలై 15(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లు త్వరలో లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మంగళవారం టిడ్కో ఛైర్మన్ వి.అజయ్‌కుమార్‌తో కలిసి గృహసముదాయాన్ని పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీహయాంలో రంగులకేప్రాధాన్యంఇచ్చి నిర్మాణంమరిచిపోయారని విమర్శించారు.డీడీలు తీసినవారికి గృహాలు అందిస్తామని, లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని కోరారు.అలాగే మునిసిపల్‌కార్యాలయం ఆవరణలో తయారుచేసిన పుష్‌కార్ట్‌లను శిరీష ప్రారంభించారు. కాగా కమిషనర్ ఎన్.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు, మునిసిపల్ సిబ్బందికి కంప్యూటర్లు అందజేశారు.

రూ.550 కోట్ల అభివృద్ధి పనులు

ఏడాది కాలంలో నియోజకవర్గంలో రూ.550 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే శిరీష తెలిపారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 22వ వార్డు పొందరవీధి, పెద్దవీధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్‌గుప్తా, యవ్వారి మోహనరావు, దడియాల నర్సింహులు, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

పోలాకి,జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే బగ్గర మణమూర్తి తెలిపారు. మంగళవారం మబగాంలోని క్యాంపు కార్యాలయంలో సారవకోటకు చెందిన గొట్టి ఈశ్వరమ్మకు గుండెసర్జరీ కోసం వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ60,713 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త బగ్గుఅర్చన పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేస్తున్న బగ్గు రమణమూర్తి

ప్రియాగ్రహారంలో గరిమెళ్లకు నివాళి

పోలాకి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం ఉన్నత పాఠశాలలో జాతీయ గేయకవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి ఉత్సవ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో గరిమెళ్ల విగ్రహానికి గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ కార్యదర్శి బాడాన రాజు, హెచ్‌ఎం పి.విశ్వేశ్వరరావు, మాజీ సర్పంచ్, లావేటి కృష్ణారావు, ఇలపండగణపతిరావు, ధనుంజయరావు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అమలు చేయాలి

● ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

ఎచ్చెర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ నియామకాల్లో సామాజికన్యాయం అమలు చేయాలని ఎస్టీకమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కోరారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీని మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరరావు

●శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ కాలనీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను డీవీజీ శంకరరావు పరిశీలించారు.

●అరసవల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి):అరసవల్లి సూర్యనారాయణ స్వామిని డీవీజీ శంకరరావు దర్శించుకున్నారు. వారికి ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

● మందస, జూలై15(ఆంధ్రజ్యోతి):గిరిజన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎస్టీకమిషన్ చైర్మన్ శంకరరావు తెలిపారు. మందసలో అధికారులు, గిరిజనులతో ముఖాముఖి, సమీక్షా సమావేశం నిర్వహించారు.

●నందిగాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల్లో రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలని దళిత మహాసభ అధ్యక్షుడు బోకర నారాయణరావు, ఆదివాసీ ఉద్యోగుల జిల్లా ప్రధానకార్యదర్శి కొచ్చ శ్రీను కోరారు. జిల్లాలో పర్యటకు వచ్చిన శంకరరావుకు వినతిపత్రం అందించారు.

జన్ ఆరోగ్య యోజనపై అవగాహన

టెక్కలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ 14 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ విష్ణుమూర్తి, మురళీమోహన్, ట్రైనర్ భుజంగరావు పాల్గొన్నారు.

పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలి

సంతబొమ్మాళి, జూలై15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు,ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలని స్కూల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు కోరారు.మంగళవారం మండలంలోని గెద్దలపాడు హైస్కూల్‌ను సందర్శించారు.కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రొయ్య కొదండరామిరెడ్డి పాల్గొన్నారు.

ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస, జూలై 15(ఆంధ్రజ్యోతి): పలాస రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ-డివిజన్ మేనేజర్ పోస్టు భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈమేరకు జిల్లా సెలక్షన్‌కమిటీ ఆధ్వర్యంలో పరిమిత నియామక నోటిఫికేషన్ విడుదలచేశారు.దీనికి సంబంధించిన దరఖాస్తు ఫార్మాట్ శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్‌జిల్లాఅధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.అర్హత గలఅభ్యర్థులు తమ దరఖాస్తు, సంబంధిత ధ్రువపత్రాలు, రూ.300 డిమాండ్ డ్రాఫ్టును జిల్లా రెవెన్యూ అధికారి పేరుమీద తీసుకొని రిజిస్ట్ పోస్టు ద్వారా లేదా కలెక్టర్ కార్యాలయం, శ్రీకాకుళం-ఎ సెక్షన్‌లోని డ్రాప్‌బాక్స్‌లో ఈనెల 29వ తేదీ సాయంత్రం ఐదుగంటలలోగా సమర్పించాలని ఆయన కోరారు.

తెలుగుభాష పరిరక్షణపై చర్చ

పలాసరూరల్, జూలై15 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష పరిరక్షణకు చేపట్టాల్సిన అంశాలు, చర్యలపై రెండురోజుల పాటు జరిగిన సదస్సులో చర్చించినట్లు గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు.కర్నూలులో రెండురోజుల పాటు ఏపీ రాష్ట్ర స్థాయి తెలుగుభాష పరిరక్షణ సదస్సు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

లక్ష్మీనర్సుపేటలో మొక్కల పంపిణీ

ఎల్.ఎన్.పేట, జూలై 15(ఆంధ్రజ్యోతి):లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో మా కానామ్ ఏక్‌పేడ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలనుపంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు మన్మథకుమార్‌మిశ్రో, ఎన్.రామారావు, లక్ష్మణరావు, ఉపేంద్రలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు..

నరసన్నపేట, జూలై15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎనిమిది మంది తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతారావు, హెచ్‌ఎం వెంకట్రావు, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

జలుమూరు, (సారవకోట) జూలై 15 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని సారవకోట టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు.మంగళవారం మండలంలోని కిన్నెరవాడ, అలుదు, బుడితి, బద్రి గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్ట ఉమామహేశ్వరరావు, పొన్నాన శంకరరావు, సారవకోట రామారావు, మట్ట గోవిందరావు, చల్ల ఆనందరావు, గొల్లంగి మోహనరావు, తర్ర లచ్చుము పాల్గొన్నారు.

ఎడమ కాలువ గట్టుకు మరమ్మతులు

హిరమండలం, జూలై15(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీపురం కాలనీ సమీపంలో వంశధార ఎడమ కాలువ కుడి గట్టుకు మంగళవారం వంశధార అధికారులు మరమ్మతులు చేపట్టారు. సోమవారం పడిన గండి యుద్ధప్రాతిపాదికన పూడ్చివేశారు. ఇక్కడకు అర కిలోమీటరు దూరంలో గట్టుకు చిన్నరంధ్రాన్ని ఈఈ మురళీ మోహన్ గుర్తించారు.దీన్నిగొట్టాబ్యారేజీసిబ్బంది రంధ్రంపూడ్చివేశారు. ఈ పనులు తహసీల్దార్ హనుమంతురావు పరిశీలించారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు కోరారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు బర్రి సురేష్, ఎర్ర భాస్కరరావు ఉన్నారు.



అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

ప్రకృతి వ్యవసాయం సాగుకు ప్రోత్సాహం

సంతబొమ్మాళి, జూలై15(ఆంధ్రజ్యోతి):రసాయన ఎరువులు క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గిస్తూ సురక్షితమైన ఆహార ఉత్పత్తే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ సాగును ప్రోత్సహిస్తోందని టెక్కలివ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్మోహన్‌రావు తెలిపారు.మంగళవారం లక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో రాళ్ళపేట అప్పారావు, అభ్యుదయ రైతులు తంగి రమణమూర్తి, జయమ్మ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): చెరకు సాగులో యాజమాన్యపద్ధతులను పాటించాలని ఏవో సూర్యకుమారి సూచించారు. మంగళవారం కిళ్లాంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వాణిజ్య పంటలను సాగుచేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. వరినారుమళ్ల సంరక్షణ విధానంపై రైతులకు అవగాహనకల్పించారు. కార్యక్రమంలో రామన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

●నందిగాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబాణాపురం, మర్లపాడుల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నారుమళ్లు, ఎదల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఏవో పి.శ్రీకాంత్‌వర అవగాహనకల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు కవిత, దీపిక, నాయకులు మద్దిలి శేషగిరి, దట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు

కోటబొమ్మాళి, జూలై 15(ఆంధ్రజ్యోతి):కురుడు, చౌదరి కొత్తూరు, కురుడుకాలనీ, సింహాద్రిపురం, నిమ్మాడల్లో 413 పశువులకు పశువైద్యాధికారి ప్రజ్ఞచైతన్యతో కలిసి కురుడు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ లంపీస్కిన్‌వ్యాధి నివారణ టీకాలు వేశారు.ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో 12 వేల లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

జలుమూరులో వర్షం

జలుమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జలుమూరు తదితర గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది.పగలంతా ఉక్కపోత, ఎండ వేడిమితో అవస్థలకు గురైన ప్రజలకు వర్షంతో ఊరట లభించింది. వారంరోజులుగా ఎండలకు వరిఎదలు ఎండిపోతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్లు కూడా వర్షం ఎంతోగానో ఉపయోగపడుతుంది.



గ్రామం మధ్యలో నిల్వఉన్న మురుగునీరు

జనావాసాల్లో మురుగు నీరు నిల్వ

● పొంచిఉన్న వ్యాధుల ముప్పు ● ఇదీ పర్లాంమాకివలసలో పరిస్థితి

జలుమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లాం మాకివలసలో జనావాసాల్లో రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని పలువురు చెబుతున్నారు. ఇదివరలో ఇంటి వాడుకలు, వర్షం నీరు వీధి గుండా గ్రామం శివారులోగల పోరంబోగు భూములకు వెళ్లిపోయేది. ప్రస్తుతం గంగన్నపేట గ్రామస్థులు ఆ మురుగునీరు పోరంబోగు స్థలానికి వెళ్లకుండా అడ్డుకట్ట వేశారని పర్లాం మాకివలస గ్రామస్థులు తెలిపారు.దీంతో నీరు బయటకు పోవడానికి వీలులేకపోవడంతో వీధిలో నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. తక్షణమే అధికారులు నిల్వఉన్న మురుగునీరు బయటకు వెళ్లేలా చొరవతీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మురుగునీటిసమస్యపై తహసీల్దార్ రామారావుకు ఫిర్యాదు చేసినట్లు పలువురు తెలిపారు. ఏటా వర్షాకాలంలో మురుగునీరు నిల్వ వల్ల ఇబ్బందిపడుతున్నామని గ్రామస్థులు వాపోయారు.

పిచ్చిమొక్కల తొలగింపు

నందిగాం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నందిగాంలో మండల కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలను తొలగించారు. మండలపరిషత్ కార్యాలయంతో పాటు ఎంఆర్‌సీ, ఉపాధి తదితర కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో జూన్ 22న పిచ్చిమొక్కలు పెరిగి శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతోఅధికారులు స్పందించి వేతనదారులతో కార్యాలయ ఆవరణలో ఉన్న మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాగిపేట, దశరథపురంలో బుధవారం ఉదయం ఎనిమిదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ నరసింహ కుమార్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నవంబరు 9న బాలియాత్ర

జలుమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలో నవంబరు 9న బాలియాత్ర నిర్వహణకు కమిటీ సభ్యులు తీర్మానించినట్లు కమిటీ ప్రతినిధి జీవీ తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళింగసీమ రాజధాని శ్రీముఖలింగంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని వంశధార నదిలో దీపాలు విడిచిపెట్టి పితృతర్పణాలు అర్పిస్తారని పేర్కొన్నారు. కటక్ నుంచి రాజమండ్రి వరకు మహానది, గోదావరి నదుల మధ్య విలసిల్లిన కళింగ రాజ్యపు పూర్వపు ఆచారం బాలియాత్ర అని తెలిపారు.

బీఎల్వోలకు శిక్షణ

పలాస రూరల్, జులై15(ఆంధ్రజ్యోతి): పలాస తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో జి.వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో బీఎల్వోలు ప్రధాన పాత్ర పోషించనుండడంతో శిక్షణ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. శిక్షణలో భాగంగా పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.కళ్యాణచక్రవర్తి, ఎన్నికల సీఎస్‌డీటీ గిరి, ప్రసాద్, వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

●నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు శిక్షణ నిర్వహించారు. ఓటర్లు నమోదు, తొలగింపు, ఎన్నికల సంస్కరణలపై డిప్యూటీ కలెక్టర్ జయదేవి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

నరసన్నపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్ టెక్నాలజీ కేంద్రంలో లెక్చరర్ పరీక్ష క్షేంద్రాన్ని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఈనెల 23 వరకు ఏపీపీఎస్సీ ఈ పరీక్షలను నిర్వహించనుం ది. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన

టెక్కలి,జూలై 15(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ విద్యార్థులకు వివరించారు. మంగళవారం కళాశాల యంత్రాంగం, రెడ్‌క్రాస్ సొసైటీ, ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీఎన్ ఆచార్యులు, వి.కోటేశ్వరరావు,రామారావు, సుగుణనందరావు,జి.రమణ, సత్యనారాయణ, ఉమాశంకర్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ల వితరణ

వజ్రపుకొత్తూరు,జూలై 15(ఆంధ్రజ్యోతి): నగరంపల్లి ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హనుమంతు కృష్ణారావు రెండు ఇన్వర్టర్లను ఆ పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.హేమారావు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఈఈగా సత్యమూర్తి

టెక్కలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): టెక్కలి డివిజన్ ఆర్‌అండ్‌బీ ఈఈగా ఎం.సత్యమూర్తి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు నుంచి పదోన్నతిపై టెక్కలి బదిలీపై వచ్చారు.

అప్పులపాలవుతున్న రైతులు

మెళియాపుట్టి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు రైతుభరోసా ఇంకా ఇవ్వకపోవడంతో అప్పులు పాలవుతున్నారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. ముఖందుపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జయముని, ఎం.మణి పాల్గొన్నారు.